

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | శనివారం | నవంబర్ 11, 2023 | www.navatelangana.com



బాల్క సుమన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

- ఇసుక మాఫియాతో కోట్లు సంపాదన
- కాంగ్రెస్ అభ్యర్థులు వివేక్, వినోద్, ప్రేమ్‌సాగర్‌రావు

2లో...



ప్రభుత్వాల తప్పిదం వల్ల గిరిజనేతరులకు అన్యాయం

- అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్
- ఇంద్రవెల్లిలో గిరిజనేతరుల సమావేశం

5లో...

నామినేషన్ల ఘట్టం సమాప్తం..!

- 13వరకు పరిశీలన..15వరకు ఉపసంహరణ
- అట్టహాసంగా ర్యాలీలు నిర్వహించిన అభ్యర్థులు
- జన సందోహంగా మారిన నియోజకవర్గ కేంద్రాలు
- చివరి రోజు కావడంతో వరుస కట్టిన అభ్యర్థులు
- ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు సమాయత్తం

వివరాలు..2లో...


ఆదిలాబాద్‌లో అల్లూరి సంజీవ్‌రెడ్డి నామినేషన్




నామినేషన్ వేయడానికి వెళ్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉండేందుకు తొలి మెట్టుగా భావించే నామినేషన్ల ఘట్టం పరిసమాప్తమైంది. ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు దాఖలు చేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించడంతో అభ్యర్థులు భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు వివిధ పార్టీలు, అనేక మంది స్వతంత్రులు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్కొక్కరు రెండు నుంచి ఐదు సెట్ల వరకు దాఖలు చేశారు. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఈ వారం రోజుల వ్యవధిలో ఒకటి, రెండు చోట్ల మినహా ఒక్కో నియోజకవర్గం నుంచి 10 నుంచి 20వరకు నామినేషన్లు దాఖలు కావడం గమనార్హం. నామినేషన్ల పర్వం ముగిసిపోవడంతో శనివారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు వాటిని పరిశీలించనున్నారు. 15వ తేదీ వరకు వాటిని ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ క్రతువు ముగిసిన తర్వాత ఆయా నియోజకవర్గాల్లో ఎందరు బరిలో ఉంటారో తెలిసిపోనుంది.

ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గుడుంబా మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వం గుడుంబా తయారీ, విక్రయాలను నిషేధించింది. ఉఉత్పత్తిదారులకు ఉపాధి కింద రూ.2లక్షల వరకు పారితోషికం ఇచ్చి అవగాహన కల్పించి గుడుంబా తయారీని అరికట్టింది. కాని ప్రస్తుతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో బెల్ట్ షాపుల మూసివేతతో మద్యం ప్రియులకు మందు దొరకని సందర్భంలో ఇదే అదునుగా జిల్లాలో గుడుంబా తయారీ, విక్రయాలు జోరందుకున్నాయి. గతంలో గుడుంబా తయారీదారులే ప్రస్తుతం మళ్లీ గుడుంబా తయారీకి పూ నుకుంటున్నారు. గ్రామాల్లో గుడుంబా గుప్పుమంటోంది. ఎక్సైజ్ అధికారులు నామమాత్రపు తనిఖీలతో మా'మూలు'గా తీసుకుంటున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజా సేవే లక్ష్యం..

- బోథ్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం
- పదేండ్ల అభివృద్ధే గెలిపిస్తుంది
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్



నవతెలంగాణ-బోథ్

ప్రజా సేవే లక్ష్యంగా పని చేస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన ఆయన ప్రజల మధ్యలో ఉంటూ సమస్యల పరిష్కారంలో తన వంతుగా కృషి చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ సాధించి ప్రచారంలో దూసుకుపోతున్న ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. తన తండ్రి రామారావ్ రాజుర గ్రామానికి నాలుగు సార్లు సర్పంచ్‌గా పని చేశారన్నారు. తాను ప్రస్తుతం జెడ్పీటీసీగా నేరడిగొండ ప్రజలకు సేవలు అందిస్తున్నానని పేర్కొన్నారు. 2009, 2014లో కాంగ్రెస్ నుంచి, 2019లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన ఏనాడూ అధైర్య పడలేదన్నారు. 20 ఏండ్ల నుంచి రాజకీయాల్లో ఉంటూ నియోజకవర్గంలోని గ్రామాలలో తిరుగుతూ ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటున్నానని తెలిపారు. తనను గుర్తించి బీఆర్ఎస్

మిగతా..2లో...

గుప్పుమంటున్న గుడుంబా

- ఎన్నికల కోడ్‌తో బెల్ట్ దుకాణాలు బంద్
- జిల్లాలో జోరుగా గుడుంబా తయారీ, విక్రయాలు
- నిద్రావస్థలో ఎక్సైజ్ శాఖ
- వసూళ్ల దందాలో ఆబ్కారీ, పోలీస్ శాఖలు?

నవతెలంగాణ-హాజీపూర్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. మరో వైపు పల్లెలు, పట్టణాల్లో నాటు సారా(గుడుంబా) విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎన్నికల కోడ్‌తో బెల్ట్ దుకాణాలను కట్టుదిట్టం చేసినా అక్కడక్కడ అక్రమంగా మద్యం దొరుకుతున్నప్పటికీ మూడు నాలుగు రెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఆర్థిక స్థోమత ఉన్న మందుబాబులు తాగకుండా ఉండలేక అధిక ధరలకైనా కొద్దికొద్దిగా కొనుక్కొంటూ నోరు తడుపుకుంటున్నారు. కానీ కూలీనాలి చేసుకునేవారు ప్రభుత్వ మద్యం కొనలేక, ఉండలేక గుడుంబా వైపు చూస్తున్నారు. గతంలో గుడుంబా దందా చేసిన వారు ఇదే అదునుగా మళ్లీ నాటు సారా కాస్తూ విక్రయిస్తున్నారు. గ్రామ శివారు ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా గుడుంబా బట్టీలు ఏర్పాటు చేసి మరీ గుడుంబా తీస్తూ విక్రయిస్తున్నారు. ఎన్నికల సమయంలో డిమాండ్ పెరగడంతో ఏరియాను బట్టి లీటర్(షేరు)కు వందకు పైగా అమ్ముతున్నారు. మండల కేంద్రంలో బెల్లం, పటికెతో సారా కాస్తున్నారు. మండలంలోని దొనబండ గ్రామాన్ని

మిగతా..2లో...


ఇటీవల పట్టుబడ్డ గుడుంబా నిందితులు(ఫైల్)

నామినేషన్ల ఘట్టం సమాప్తం..!

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో నామినేషన్ల ఘట్టం ముగిసిపోవడంతో అభ్యర్థులంతా ప్రచార పర్వంలో నిమగ్నం కానున్నారు. ఈ నెల 30న పోలింగ్ నిర్వహించడంతో ప్రచారానికి మరో 20రోజుల సమయం మాత్రమే ఉంది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీతో పాటు బీఎస్పీ, డీఎస్పీ పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో పాటు వారికి బీఫారాలు అందించారు. వీరితో పాటు కొంత మంది ఆయా పార్టీలకు రెబల్ అభ్యర్థులుగా పోటీ చేస్తుండటంతో పాటు అనేక మంది స్వతంత్ర అభ్యర్థులు సైతం బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. మరోపక్క ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఒక విడత ప్రచారాన్ని పూర్తిచేసుకోగా.. కొందరు మాత్రం టికెట్ కోసం చివరి వరకు నిరీక్షించి ఇప్పుడిప్పుడే ప్రచారాన్ని ప్రారంభించారు. స్వతంత్ర అభ్యర్థులు కొందరు పల్లె, పట్టణాల్లో ప్రచారాన్ని చేపడుతూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.

అట్టహాసంగా ర్యాలీలు..!

నామినేషన్ల సమర్పణకు చివరి రోజు కావడంతో ఉమ్మడి జిల్లాలో ప్రధాన పార్టీలతో పాటు పలువురు స్వతంత్రులు భారీ ర్యాలీలు నిర్వహించారు. పల్లెలు, పట్టణాల నుంచి జనాన్ని సమీకరించి నియోజకవర్గ కేంద్రాల్లో సందడి చేశారు. పెద్ద ఎత్తున జనాన్ని సమీకరించి తమ బలాన్ని ప్రదర్శించారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అల్లూరి సంజీవరెడ్డి భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. పల్లెలు, పట్టణం నుంచి వేలాది మంది జనం ఈ ర్యాలీలో పాల్గొనడంతో జిల్లా కేంద్రం జనసంద్రమైంది. సిర్పూర్(టి) బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. దీంతో ఆయా నియోజకవర్గ కేంద్రాలు జన సందోహంగా మారాయి.

చివరి రోజున నామినేషన్లు ఇవే

నామినేషన్ల చివరి రోజైన శుక్రవారం భారీగా దాఖలయ్యాయి. ఆదిలాబాద్‌లో 25 మంది దాఖలు చేయగా ఖానాపూర్‌లో 13మంది నామినేషన్లు వేశారు. బెల్లంపల్లిలో ఏకంగా 20మంది దాఖలు చేశారు. ముధోల్‌లో 19మంది అభ్యర్థులు బరిలో నిలిచేందుకు నామినేషన్లు సమర్పించారు. బోథ్‌లో ఆరుగురు నామినేషన్లు దాఖలు చేయగా.. ఆసిఫాబాద్‌లో 15మంది అభ్యర్థులు దాఖలు చేశారు. చెన్నూర్‌లో 34 నామినేషన్లు దాఖలయ్యాయి. నిర్మల్‌లో 16 నామినేషన్లు దాఖలు కాగా సిర్పూర్‌లో 19 నామినేషన్లు వచ్చాయి. మంచిర్యాలలో 24 నామినేషన్లు దాఖలు కావడం విశేషం. ఈ వారం రోజుల వ్యవధిలో నామినేషన్లు వందల సంఖ్యలో ఉండనున్నాయి.

గుప్పుమంటున్న గుడుంబా

(మొదటి పేజీ తరువాయి)

ఆనుకొని ఉన్న కడెం కెనాల్‌తో పాటు గ్రామంలో కూడా విచ్చలవిడిగా గుడుంబా అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఎల్లంపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు, గుడిపేట్, దుబ్బపల్లి, పెద్దంపేట్, నర్సింగ్‌పూర్, రాపల్లి గ్రామాల్లో కూడా జోరుగా గుడుంబా విక్రయాలు జరుగుతున్నాయి. ర్యాలీ వాగు సమీప అటవీ ప్రాంతంలో బట్టీలు ఏర్పాటు చేసి సారా కాస్తున్నట్లు మండలంలో చర్చించుకుంటున్నారు. ఇలా జిల్లాలోని అన్ని మండలాల్లో గుడుంబా విచ్చలవిడిగా లభ్యమవుతున్నట్టు తెలుస్తోంది. ఇది సంబంధిత శాఖ అధికారులకు తెలిసే జరుగుతున్నట్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

అంతా ఎక్సైజ్ శాఖ సహకారంతోనేనా?

ఎన్నికల కోడ్‌తో పోలీస్ శాఖ తీరిక లేకుండా శ్రమిస్తున్నట్లు ప్రకటనలు ఇస్తునాన జోరందుకున్న గుడుంబాను అరికట్టలేకపోతోంది. రోజు వారీ వసూళ్లకు సంబంధిత శాఖలు సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అడపాదడప కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. అక్కడక్కడ గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తూ నిందితులపై కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం బెల్ట్ షాపులు సైతం రాత్రి వేళల్లో తెరుచుకుంటున్నాయి. గుడుంబా నిర్మూలనే ధ్యేయంగా పని చేయాల్సిన ఎక్సైజ్ శాఖ మాత్రం నిద్రావస్థలో ఉందని విమర్శలు వస్తున్నాయి. గతంలో ఎవరెవరు గుడుంబా తయారు చేస్తున్నారనే స్పష్టమైన సమాచారం వారి వద్ద ఉన్నప్పటికీ అరికట్టలేక పోతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పట్నుండి మంచిర్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 38 గుడుంబా కేసులు నమోదయ్యాయి. నాటు సారా కాస్తున్న 28 మందిని అరెస్ట్ చేసి 118 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. అక్కడక్కడ ఎక్సైజ్ శాఖ దాడులు చేస్తూ విక్రయించే వారిని మాత్రమే అరెస్ట్ చేస్తూ తయారీదారులను గుర్తించడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

ప్రజా సేవే లక్ష్యం..

(మొదటి పేజీ తరువాయి)

అధిష్టానం బోథ్ టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఉన్నత చదువులు చదివిన తనకు నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తారనే నమ్మకం ఉందన్నారు. వారి ఆశీర్వాదం తనకుంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. పార్టీ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ముకాకుండా నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధియే మూడోసారి అధికారం అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం అమలు చేస్తున్న పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని తెలిపారు. పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో పేదలకు మరింత సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఇతర పార్టీల మాయమాటలు నమ్మవద్దని కోరారు. ఒక సారి అవకాశం ఇస్తే నియోజవకర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇసుక మాఫియాతో కోట్లు సంపాదించిన

బాల్క సుమన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

నవతెలంగాణ - హాజీపూర్

చెన్నూరులో ఇసుక మాఫితో అడ్డదారిలో బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ కోట్లు సంపాదించారని కాంగ్రెస్ చెన్నూరు అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల పట్టణంలో గల హైటెక్ సిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, బెల్లంపల్లి అభ్యర్థి గడ్డం వినోద్, ఏఐసీసీ సభ్యులు మోహన్ జోషి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజల వైపు కాంగ్రెస్ పార్టీ ఉందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ మాత్రం కమీషన్ల కోసం ఉందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో దాదాపు రూ.70వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. మిషన్ భగీరథలో రూ.40వేల కోట్ల కమీషన్ కేసీఆర్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసిఆర్ రూ.60వేల కోట్లు అప్పు చేసి ప్రజలపై భారం మోపినట్లు వాపోయారు. మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం తథ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తప్పు చేసిన బీఆర్ఎస్ ప్రతినిధులపై చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ పరిపాలనలో ఎమ్మెల్యేలు మూడు నియోజకవర్గాలలో ఎక్కడ కూడా అభివృద్ధి పనులు చేయలేదని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ అహంకారంతో పాలించారని తెలిపారు. మూడు నియోజకవర్గాల్లో ప్రజలందరూ బీఆర్ఎస్ మీద వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మీద గతంలో చూపించిన దానికంటే ఎక్కువ ఆదరణ చూపిస్తున్నారని వెల్లడించారు. సూట్ కేసులతో కొనడానికి వచ్చారని తప్పుడు ఆరోపణలు చేస్తున్న బాల్క సుమన్ మాటలను తీవ్రంగా ఖండించారు. సుమన్ మాదిరిగా ఇసుక, కోల్ మాఫియాతో అడ్డదారిలో వేల కోట్లు కమీషన్ రూపంలో సంపాదించలేదని తెలిపారు. ఓటర్లు జాగ్రత్తగా ఆలోచించి ప్రజల పార్టీ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు.

అవకాశమిస్తే మైనారిటీల కోసం కృషి చేస్తా



నవతెలంగాణ-మందమర్రి

అవకాశం ఇస్తే మైనారిటీల సంక్షేమం కోసం కృషి చేస్తానని చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మందమర్రిలోని మసీదు ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన మైనారిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి మాట్లాడారు. నాన్న వెంకటస్వామి కాలం నుండి మైనారిటీలతో మంచి అనుబంధం ఉందన్నారు. మైనార్టీలు చూపించే ప్రేమ మాటల్లో చెప్పలేమని, ముస్లిం సాంప్రదాయ వంటకాలు తమ ఇంట్లో భాగం అయ్యాయని తెలిపారు. తమ సంస్థలో మైనార్టీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చానని అన్నారు. సామాజిక వర్గం ఏదైనా బాల్క సుమన్‌కు చిన్న చూపేనని అన్నారు. ప్రజలకు సేవ చేయడం ఒకటే తమకు తెలుసునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేక్ కుమారుడు వంశీకృష్ణ, ఆజం అలీ పాషా, ఇషాక్ పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన గ్రామాల్లో దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలైన చౌడుగూడ, చిక్రంగూడ, కొత్తగూడ, ముత్యంపల్లి, లంబాడితండా గ్రామాల్లోని పేదలకు భూపాలపల్లికి చెందిన గాజుల అరుణ్‌కుమార్ తన తల్లి గాజుల పద్మ జన్మదినం సందర్భంగా దుప్పట్ల పంపిణీ చేశారు. గిరిజన గ్రామాల్లో మొత్తం 60 మంది పేదలను గుర్తుంచి దుప్పట్లు పంపిణీ చేశారు. చలి కాలం నేపథ్యంలో అమ్మ జన్మదినం సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు గాజుల అరుణ్ కుమార్ తెలిపారు. తన తల్లి 100 ఏళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షిస్తూ వేడుకలు చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, గాజుల మహేష్, ఆదివాసీ సంఘం నాయకుడు పెంద్రం హన్మంతు, గిరిజనులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో చోరీ

నవతెలంగాణ-తాండూర్

తంగళ్లపల్లి గ్రామంలో సైఫ్ కిరాణా, జనరల్ స్టోర్‌లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రూ.20వేల నగదు, రూ.5వేల విలువ గల వస్తువులను దొంగిలించార దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు.

మేదరి సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

రామకృష్ణాపూర్: పట్టణ మేదరి సంఘం నూతన కార్యవర్గాన్ని స్థానిక శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం సంఘం రాష్ట్ర నాయకులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏకుల సత్యం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణ మేదరి సంఘం అధ్యక్షులుగా గైని రాజేంద్ర ప్రసాద్, జనరల్ సెక్రెటరీ పిల్లి రవి కిరణ్, కోశాధికారి గైని శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి మంతెన సమ్మయ్య, ఉపాధ్యక్షులు గైని ఐలయ్య, సులువ శంకర్, జాయింట్ సెక్రెటరీ ఓడిపెల్లి తిరుపతి,పిల్లి రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వలిపిరెడ్డి శ్రీనివాస్, పిట్టల నరసయ్య, ముఖ్య సలహాదారులు చంద చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు పిల్లి రాజశేఖర్, గైని రమేష్, పోతు సంపత్, చందా వెంకటేశ్వర్లు, లింకేటి ఎల్లయ్య,మెసెంజర్ గైని వంశీ కిరణ్ ఎన్నికయ్యారు. వీరితో పాటు మహిళ సంఘం అధ్యక్షురాలిగా లింకేటి స్వరూప, ఉపాధ్యక్షులు మధిరె ఈశ్వరి, ప్రధాన కార్యదర్శి పిల్లి విజయలక్ష్మి, కోశాధికారి గైని లక్ష్మి, జాయింట్ సెక్రెటరీ లింకేటి భవిత, ప్రచార కార్యదర్శి గైని రాజమణి, కార్యవర్గ సభ్యులు గైని రాజ్యలక్ష్మి, పిల్లి లావణ్య, మంతెన హేమలత,గైని భార్గవి,చంద మల్లేశ్వరి ఎన్నికయ్యారు.

బీజేపీ రెబల్‌గా అందుగుల శ్రీనివాస్ నామినేషన్

చెన్నూర్ : బీజేపీ రెబల్‌గా అందుగుల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 నుంచి బిజెపి కండువాను, పార్టీ జెండాను భుజంపై మోశానని తెలిపారు. కానీ పార్టీ దాన్ని విస్మరించి డబ్బులకు అమ్ముడుపోయిందన్నారు. బిజెపి అంటే మంచి విధానాలు కలిగిన పార్టీ అని అనుకున్నామని, కానీ కార్యకర్తల మనోభావాలు దెబ్బ తినేలా చేశారని తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ కోసం అహర్నిశలు పాటుపడిన తనను విస్మరించి పార్టీలో లేని కొత్త వ్యక్తిని తీసుకొచ్చి టికెట్ కేటాయించడం బాధాకరమన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకే రెబల్‌గా నామినేషన్ దాఖలు చేశానని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాసిపేట: మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. కొండాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌తో పాటు 33 కేవీ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
శనివారం నవంబర్ 11, 2023

ప్రాంగణ నియామకాల్లో ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బాసర

ప్రాంగణ నియామకాల్లో బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీ విద్యార్థులు సత్తా చాటారు. ఆయా విభాగాలలో సుమారు 62 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంపై యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపికైన 62 మంది విద్యార్థులను అభినందించారు. వీరు రూ. 4 లక్షల నుండి రూ.15 లక్షల గరిష్ఠంగా వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించడం యూనివర్సిటీకి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్, ప్లేస్మెంట్ ట్రైనింగ్ అధికారి హరిబాబు, నరేందర్, సృజన, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆదరించండి

- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

అభివృద్ధి చూసి ఆదరించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేశంలో ఎక్కడ లేని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, హజ్ కమిటీ సభ్యులు నాజీరొద్దీన్, అప్పాల మహేష్, అప్పాల గణేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో ఎన్నికలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులుగా రవిరంజన్ కుమార్ విక్రమ్, ఖానాపూర్ నియోజకవర్గానికి కే. గోపాలకృష్ణ, వ్యయ పరిశీలకులుగా కేఎం శ్రేయాస్, లక్ష్మణ్ నింబార్గీలను కేటాయించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల కమిటీలను వేసి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నామన్నారు. మొత్తం ఓటర్లు 7లక్షల 11వేల 190 ఉండగా, పురుషులు 3 లక్షల 44వేల 458, స్త్రీలు 3 లక్షల 66 వేల 683, థార్డ్ జెండర్స్ 49 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరి కోసం 922 కేంద్రాలను ఏర్పాటు చేశామని, నిర్మల్‌లో 306, ముధోల్‌లో 311, ఖానాపూర్‌లో 305 కేంద్రాలున్నాయన్నారు. 205 సమస్యాత్మక కేంద్రాలున్నాయని, 664 పోలింగ్ లోకేషన్స్ ఉండగా మొత్తం 4619 సిబ్బందికి విధులు కేటాయించామన్నారు. నామినేషన్ల పరిశీలన, పోలింగ్ స్లిప్‌ల పంపిణీ, సాక్ష్యం యాప్, సువిధ అనుమతులు, సి-విజిల్ ఫిర్యాదుల పరిష్కారం, పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ, ఇతర ఎన్నికల నిర్వహణకు సంబంధించి, తీసుకోవలసిన చర్యలపై రిటర్నింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎస్పీ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

గిరిజన నిధులు దారి మళ్లింపు

- భైంసా ఏఎంసీ చైర్మెన్ ఆరోపణ



నవతెలంగాణ-ముధోల్

నియోజకవర్గంలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనుల నిధులను ఎమ్మెల్యే విఠల్ రెడ్డి దారి మళ్లిస్తున్నారని భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్ బాబు ఆరోపించారు. మండలంలోని విట్టోలి తాండా గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని తరోడ నుండి చింతకుంట తాండా వరకు నూతన బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే రూ.4.12 కోట్లు గిరిజన నిధులను మంజూరు చేయడం సరికాదన్నారు. అక్కడ బీటీ రోడ్డు ఉందని కేవలం రెన్యువల్ బీటి మంజూరు చేయిస్తే సరిపోతుందన్నారు. దానికి రూ. 50లక్షలు మంజూరు చేస్తే సరిపోతుందన్నారు. కావాలని గిరిజన ప్రాంతాల్లో ఖర్చు చేయాల్సిన నిధులు ఇతర రోడ్లకు ఉపయోగిస్తు దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. రంగరి గుడిసెలకు మంజూరు చేసిన రోడ్డుకు గిరిజన నిధులు ఎందుకు అవసరమన్నారు. తమ బంధువుల కోసమే ఈరోడ్డుకు గిరిజన నిధులు మళ్లించారని ఆరోపించారు. తనవి తప్పుడు ఆరోపణలు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేసిన స్పందించలేదన్నారు. ఎలాంటి తప్పులు చేయని ఎమ్మెల్యే ఎడ్‌బిడ్ తాండ సమ్మక్క-సారలమ్మ వద్ద చర్చకు రావాలని తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అంతకు ముందు నిధుల మళ్లింపుపై గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి నినాదాలు చేశారు. ఈ సమావేశంలో విట్టోలి తాండా సర్పంచ్ విజేష్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మి మోసపోకండి

నవతెలంగాణ-కుభీర్

బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు నమ్మి మోసపోకుండా చూడడంతో పాటు ఏ విధంగా మోసం చేసిందో కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ అభ్యర్థి బోస్లె నారాయణ రావ్ పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలాజీ జిన్నింగ ఫ్యాక్టరీలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారం కోసం బీఆర్ఎస్ మోసపూరిత హామీలు, వాగ్దానాలు చేస్తుందన్నారు. కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీల అమలు చేసేవిధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. గృహ లక్ష్మీ పథకం ద్వారా రూ. 5లక్షలు, ఏకాలంలోనే రూ.2లక్షల రైతు రుణమాఫీ, ప్రతి ఒక్క మహిళకు రూ. 2500 ఆర్థిక సహాయం, రూ.500 కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామన్నారు. కార్యకర్తలు కష్టపడి పని చేస్తూ పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. అనంతరం జండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో జైరాం ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరావ్ పటేల్

వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఇన్‌చార్జి మండల అధ్యక్షుడు జైరాం, డాక్టర్ శివరాం, మాజీ ఎంపీపీ రామచందర్ రెడ్డి, బంక బాబు, యువజన అధ్యక్షుడు విలాస్ జావిద్ ఖాన్, మాజీ ఎంపీటీసీ బషీర్, ఓం ప్రకాష్, శంకర్, భీంరావు, లతీఫ్ పాల్గొన్నారు.

కల్లెడలో బీఆర్ఎస్ ప్రచారం



నవతెలంగాణ-కడెం

మండలంలోని కల్లెడలో సర్పంచ్ వెంబడి లావణ్య తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిస్తు, మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ బలపరిచిన అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మెన్ కానూరు సతీష్, అజ్మీర శంకర్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఒడ్నాల సత్యం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రత్నాల పోషన్న, సారంగాపూర్ ఉపసర్పంచ్ కోల నరేష్, సీనియర్ నాయకులు కుమ్మరి సతీష్, బియ్యాల దుర్గయ్య, మాజీ సర్పంచ్ బోయిడి అంకన్న, చిన్న నర్సయ్య పాల్గొన్నారు.

బీఎస్పీని ఆదరించండి



నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ ఉద్యమ పోరాటంలో పాల్గొన్న తనను ప్రజలు గెలిపించాలని ముధోల్ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి సర్దార్ వినోద్ కోరారు. శుక్రవారం తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్ఓకు అందించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం యువకులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయలేదన్నారు. ఉస్మానియా విద్యార్థి సంఘం నాయకుడిగా విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేశానన్నారు. నియోజకవర్గ ప్రజా సమస్యలపై తాను పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలు సైతం బహుజన్ సమాజ్ పార్టీకు తమ ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రజల హక్కుల కోసం నిరంతరంగా పోరాడుతామని తెలిపారు.

30వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలనే డిమాండ్‌తో విద్యా భారతి పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 30వ రోజు విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా మండల కేంద్ర అవశ్యకతను వివరిస్తూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు కొట్టే రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే, అధికారులకు విన్నవించామని తెలిపారు. మండలంగా ప్రకటిస్తామని చెప్పి మోసం చేసి వేరే గ్రామాన్ని మండలంగా ప్రకటించారని మండిపడ్డారు. పల్సి మండలం కావడానికి అన్ని అర్హతలున్న పట్టించుకోవడం లేదన్నారు. మండలంగా ప్రకటించాని పక్షంలో ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. అప్పటి వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వాల తప్పిదం వల్ల గిరిజనేతరులకు అన్యాయం

- అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీలో స్వాతంత్ర్యం కంటే ముందు నుంచే నివసిస్తున్న గిరిజనేతరులు ప్రభుత్వాల తప్పిదాల వల్లే అన్యాయానికి గురవుతున్నారని అంబేడ్కర్ మనుమడు ప్రకాష్ అంబేడ్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా గిరిజనేతరుల హక్కుల సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హక్కులు, అధికారంపై పోరాడేలా రాజ్యాంగం ప్రాథమిక హక్కులను కల్పించిందన్నారు. డా. బాబాసాహెబ్ అంబేద్కర్ తన రాజ్యాంగంలో ఆర్టికల్ 224లో 5వ షెడ్యూల్ ప్రకారం గిరిజనులు అధికంగా నివసం ఉండే గ్రామాలను ఏజన్సీ గ్రామంగా ప్రకటించాలన్నారు. కానీ ఆనాటి ప్రభుత్వ అధికారులు తప్పుడు సర్వేల వల్ల అనేక గ్రామాల్లో గిరిజనులు లేకున్న ఏజన్సీ ప్రాంతాలుగా గుర్తించడంతో గిరిజనేతరులు వారి భూమిపై హక్కును కోల్పోయారన్నారు. ఫలితంగా రైతుబంధు, బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారన్నారు. దీని కోసం ప్రజలో మార్పు రావాలన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, బిర్యానికు లొంగకుండా మంచి నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. ప్రతి ఏటా పది వేల మంది విదేశీ విద్య కోసం వెళ్తున్నారని, మెడికల్ సీటు రూ.ఐదు లక్షల్లో పూర్తి అవుతుందన్నారు. కానీ భారత దేశంలో మాత్రం రూ. కోటి



వరకు ఖర్చు అవుతుందన్నారు. దానికి పాలకులే కారణమని ఆరోపించారు. 2014-23 వరకు 16లక్షల మంది విదేశీ నాగరికతను స్వీకరించారని తెలిపారు. గిరిజనేతరుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భారత్ వాగ్మారే మాట్లాడుతూ 1963లో తెచ్చిన ఎల్‌టీఆర్ చట్టం కారణంగా తమ భూమిని ఇతరులకు అమ్మే హక్కును సైతం కల్పించలేదన్నారు. ఈ సమావేశంలో యూనిస్ అక్బాని, మల్లెపూల నర్సయ్య, ప్రజ్ఞకుమార్, సంజయ్ లహానే, మారుతి, దుర్గం శేఖర్, మసూద్, బారిక్‌రావ్, బోయకుంట ప్రకాష్, రాజారెడ్డి, సాగర్‌రెడ్డి, దిలీప్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం..ఆదరించండి

నవతెలంగాణ-బేల

పదేండ్ల తమ పాలనలో గత ప్రభుత్వాలు చేయని విధంగా అభివృద్ధి చేశామని ఈ సారి కూడా తమను ఆదరించాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యాటించారు. గ్రామాల్లోని ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మండలంలోని అవాల్‌పూర్, సిర్సన్న, బాది, విష్ణుగూడా, హేటి గ్రామాల్లో ఆయన పర్యటిస్తు ప్రచారం నిర్వహించారు. సైద్‌పూర్‌లో ఆదివాసీలు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా గులాబి కం డువాలు కప్పి ఆహ్వానించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన దండారి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివాసి సంస్కృతి, సంప్రదాయం ప్రకారం నెమలి పించం ధరించి నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఆదివాసిలతో కలిసిపోయి ఆప్యాయంగా పలకరిస్తూ తనదైన శైలిలో ప్రచారాన్ని చేపట్టారు. బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను వంచించిన బీజేపీ, కాంగ్రెస్‌లకు తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మెన్ రౌత్ మనోహర్, నాయకులు గంభీర్ ఠాక్రే, జక్కుల మధుకర్, దేవన్న, సతీష్ పవార్, మినక సుధాంరెడ్డి, దంతేలా వినోద్ పాల్గొన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

నవతెలంగాణ-ఉట్నూర్

కిరాణం దుకాణంలో చోరీ జరిగిన సంఘటన గురువారం రాత్రి మండలంలోని లక్కారంలో జరిగింది. బాధితులు రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం లక్కారంలో కిరణ దుకాణం నిర్వహిస్తున్నాడు. యధావిధిగా రోజు రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్ళిపోయాడు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం తిరిగి దుకాణాన్ని తెరిచేసరికి చోరీ జరిగినట్లు ఆనవాలు కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రూ. 8వేల నగదు, సామాగ్రితో మొత్తం రూ.30వేల చోరీ జరిగినట్లు దుకాణ నిర్వహకుడు పేర్కొన్నారు. బాదితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రెబల్ అభ్యర్థిగా సంజీవ్‌రెడ్డి నామినేషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ రెబల్ స్వతంత్ర అభ్యర్థిగా సంజీవ రెడ్డి శుక్రవారం నామినేషన్ వేశారు. జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి నివాసం నుండి భారీ ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీ ప్రధాన కూడళ్ల మీదుగా డప్పు చప్పుళ్ల యువకుల నృత్యాలతో ర్యాలీ సాగింది. ర్యాలీలో దాదాపు 10వేలకు పైగా ప్రజలు పాల్గొనడంతో ఆయా కూడళ్లు జన సంద్రోహంగా మారాయి. పార్టీమాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతలతో కలిసి సంజీవ్ రెడ్డి తన నామినేషన్ పత్రాన్ని ఆర్‌ఓకు అందించారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడల్లో నైపుణ్యాలు మెరుగుపరుచుకుని జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని పట్టణంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం పిల్లి కిషన్ అన్నారు. శుక్రవారం ఎస్టీఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలలో అండర్-17, 19 బాలబాలికల షూటింగ్ బాల్ జిల్లాస్థాయి జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ప్రతిభ గల విద్యార్థులకు ఆటల పోటీల్లో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలని, అపుడే విద్యార్థులు మానసికంగా ధృడంగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల కన్వీనర్ హరిచరణ్, ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్, పీఈటీలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా

నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ఏజెండాగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో గణనీయ పురోగతిని సాధించామని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని పంజేషా, చించరవాడ కాలనీలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరును వివరిస్తూ మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. పలువురు యువకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాగ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యూనిస్ అక్బాని, భాస్కర్, బాదన్ గంగన్న, స్వరూప రాణి, కస్తాల ప్రేమల పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో హెచ్ఐవీపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్, డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహనలో భాగంగా స్కిట్ కాంపిటీషన్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్న కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి పొందారు. ప్రథమ బహుమతి ఆర్ట్స్ కళాశాలకు చెందిన విద్యార్థులకు లభించింది. ఈ సందర్భంగా సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీ అచ్చి శ్రీనివాస్ విద్యార్థులను అభినందించి వైరస్‌పై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దయాకర్, ఎండి అశ్రఫ్ అలీ పాల్గొన్నారు.

వరుసగా రెండో రోజు బైక్ చోరీ

నవతెలంగాణ-బోథ్

మండలంలో వరుసగా రెండవ రోజు కూడా బైక్ దొంగతనం భయందోళనలకు గురి చేస్తుంది. గురువారం జరిగిన సంఘటన మరువకే ముందే శుక్రవారం మండలంలోని సోనాల గ్రామానికి చెందిన సూర్య మాణిక్ రావు చెందిన మోటార్ సైకిల్ చోరికి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గురువారం అర్ధరాత్రి సమయంలో ఇంటి అవరణ నుంచి బైక్‌ను ఎత్తుకెళ్లినట్టు తెలిపారు.

దళితులకు మూడెకరాల భూమి హామీ ఏమైంది?

నవతెలంగాణ-బేల

దళితులకు ఇస్తామన్న మూడెకరాల భూమి ఎమైందని అవాల్‌పూర్ ఎంపీపీటీసీ నాగేష్ రెడ్డి ఎమ్మెల్యే రామన్నను ప్రశ్నించారు. శుక్రవారం దళితులతో కలిసి గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. దళితులకు ఇచ్చిన హామీలను పూర్తి చేయకుండా దళిత వాడల్లో ఏ విధంగా ప్రచారం చేస్తారని ఆయన ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూం కూడా మంజూరు చేయలేదన్నారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు, నిరోద్యోగులు కలిసి కట్టుగా జోగు రామన్నకు బుద్ధి చెప్పాలని కోరారు.

దండారి ఆడిన జాన్సన్ నాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

దీపావళి పండుగ నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో డోలు, సన్నాయి, నృత్యాలతో మారుమోగుతున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ మండలంలోని హిరపూర్-జే, కోలాంగూడ, మత్తడిగూడా, కన్నాపూర్ గ్రామాల్లో నిర్వహించిన దండారి ఉత్సవాల్లో పాల్గొన్నారు. దండారి సభ్యులతో కలిసి కోలాటం ఆడారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ అత్యంత ఘనంగా నిర్వహించుకునే దండారికి నిధులు మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని జాన్సన్ నాయక్ తెలిపారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని భుక్తాపూర్, సినిమారోడ్, మోచిగల్లి, ద్వారకానగర్, విద్యానగర్ ఏరియాల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లు వెంటనే ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని పలు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి రోజులు గడుస్తున్న అధికారులు మాత్రం కొత్తవి ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత మండల విద్యుత్ శాఖ అధికారులకు ఇప్పటికే విషయం తెలియజేసిన పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం కంది, పత్తి, పంటలు సాగువుతున్నాయని తెలిపారు. వేల మంది రైతులు శనగ పంటను వేసుకున్నారన్నారు. పాడైన ట్రాన్స్‌ఫార్‌లను అధికారులకు అప్పగించి 10 రోజులు గడుస్తున్నా వాటి స్థానంలో కొత్తవి సకాలంలో ఏర్పాటు చేయలేదన్నారు. ఆయనతో పాటు రాకేష్, కేశవ్, సురేష్ ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో డాల్డా కంపెనీ వద్ద రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీస్ కానిస్టేబుల్ జె. భోజన్న సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కానిస్టేబుల్ భోజన్న తెలిపిన వివరాల ప్రకారం వయస్సు 40 సంవత్సరాలు వ్యక్తి బ్లూ కలర్ చెక్స్ షర్ట్, సిమెంట్ కలర్ జీన్స్ ప్యాంట్ వేసుకున్నడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు. వ్యక్తిని గుర్తిస్తే సెల్ నెంబర్ 9440442722కు సంప్రదించాలని కోరారు.

ఎన్నికల తీరును పరిశీలించిన ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్

నవతెలంగాణ-ఉట్నూర్

అసెంబ్లీ ఎన్నికల సరళిని పరిశీలించేందుకు శుక్రవారం ఆర్వో కార్యలయానికి ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ గోపాలకృష్ణన్ చేరుకున్నారు. ఎలక్షన్ జనరల్ అబ్జార్వర్ రావడంతో ఆర్‌ఓ జీవాకర్ రెడ్డి ఆయనను పులకుండి అందించి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో ఎన్నికల నేపథ్యంలో పలు వివరాలను ఆర్‌ఓను అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేల పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నామినేషన్ల స్వీకరణను పరిశీలించి అధికారులు పలు సూచనలు చేశారు.

బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

ప్రభుత్వ పని తీరుకు ఆకర్షితులై అనేక మంది బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో లక్ష్మీపూర్, మాంగుర్ల, సుందరగిరి, కేఆర్కే కాలనీకి చెందిన పలువురు నాయకులు ఆ పార్టీలో చేరగా ఎమ్మెల్యే రామన్న వారికి గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. వాటి ఫలితంగా లక్షలాది సంఖ్యలో యువతకు ఉపాధి లభించిందని పేర్కొన్నారు. యువత భవితకు భరోసా కల్పించే దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతున్న తమ పార్టీకి మద్దతుగా భారీ ఎత్తున మద్దతు లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మెన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, యాసం నర్సింగ్‌రావు, స్వరూప రాణి, అడప తిరుపతి పాల్గొన్నారు.

నా జీవితం ప్రజలకే అంకితం

- ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి



ప్రప్రప్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తన జీవితం నియోజకవర్గ ప్రజలకు అంకితం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంకుమరాజుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసిఫాబాద్ పట్టణ ప్రజలు తనను చేరదీసి రాజకీయ భవిష్యత్తుకు పునాది వేశారని తెలిపారు. సర్పంచ్‌గా గెలిపించడంతోనే ఈరోజు ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానని, ఇక్కడి ప్రజల ఆశీర్వాదాన్ని ఈ జన్మలో మర్చిపోలేనని తెలిపారు. మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం వచ్చిందని, ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి ఎంతో అభివృద్ధి చేశామన్నారు. తమ పాలనలో వ్యాపారులు ఎంతో సంతోషంగా ఉన్నారని, అందరి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు గంధం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలువేరు వెంకన్న, నాయకులు వెంకన్న, రవి, అశోక్, సుగుణాకర్, నిజాం, ఖాసిం, రాజు, గిరి, సంగీత, వందన పాల్గొన్నారు.

పోరాట యోధులను నిరంతరం స్మరించుకోవాలి



ప్రప్రప్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసీ పోరాట యోధులను నిరంతరం స్మరించుకోవాలని జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని రౌటసంకపల్లిలో నిర్వహించిన ఎడ్లకొండు 83వ వర్ధంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదివాసులు గుస్సాడి, డోలుతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కొమురం భీం, ఎడ్లకొండ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం ఎంతోమంది పోరాటం చేశారని గుర్తు చేశారు. వారందరిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఆదివాసీ పోరాట యోధులకు సముచిత స్థానం కల్పించిందన్నారు. దీనిలో భాగంగానే జోడేఘాట్ అభివృద్ధి కోసం మొదటి సంవత్సరంలోనే రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఆదివాసుల అభివృద్ధి కోసం పోడు సాగుదారులకు పట్టాలు పంపిణీ చేసినట్లు వివరించారు. రానున్న రోజుల్లో ఆదివాసుల సంక్షేమం కోసం మరిన్ని పథకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉత్సవ కమిటీ చైర్మన్ కిష్టయ్య, నాయకురాలు కొమురం వందన, ప్రసాద్ గౌడ్, నిజాం, నంబయ్య, బుజడి వెంకన్న ఆదివాసీలు పాల్గొన్నారు.

సీపీఐని బలోపేతం చేసింది దాజీ శంకరే

నవతెలంగాణ-తాంసి

ఆదిలాబాద్ జిల్లాలో సీపీఐ పార్టీని బలోపేతం చేసి అందరిని ఐక్యతం చేసి పోరాటలు చేసిన వ్యక్తి దాజీ శంకర్ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఈదుల్లా సవర్గాంలో దాజీ శంకర్ 38వ వర్ధంతిని పార్టీ నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన పార్టీ, ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని బలోపేతం చేసి ప్రతి ఒక్కరిని చైతన్యవంతం చేసి భూ, స్వతంత్ర పోరాటంలో చురుగ్గ పాల్గొన్నారు. మొట్ట మొదటిసారిగా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికైన వ్యక్తి శంకర్ అని తెలిపారు. ప్రజాసేవకే అంకితమై తన ఆస్తులను సైతం ప్రజలకు పంపిణి చేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పార్టీని ముందుకు తీసుకువెళ్లాడంతో పాటు ప్రజల పక్షాన



నిలబడి హక్కులను సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విలాస్, నళిని రెడ్డి, సట్వాజీ, దేవిదాస్ ఉన్నారు.

ఘనంగా జిల్లా స్థాయి ప్రదర్శన పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను పురస్కరించుకుని శుక్రవారం సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో జిల్లా స్థాయి ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ ప్రణీత పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. ఆరోగ్యం, శ్రేయస్సు, పర్యావరణ వ్యవస్థను అర్థం చేసువడం ప్రధాన అంశంగా ఈ కార్యక్రమం చేసినట్లు డీఈఓ తెలిపారు. మనవ జీవనంలో సైన్స్ ఎంతో దోహద పడుతుందన్నారు. ప్రకృతి నూతన ఆవిష్కరణలకు దోహదం అవుతుందని, విద్యార్థి దశ నుండే ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సైన్స్ కాంగ్రెస్, ఇన్స్‌పైర్ అవార్డ్స్, జవహర్ లాల్ నెహ్రూ సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని శాస్త్రీయ వైఖరులు, దృక్పథాన్ని పెంచుకోవాలని సూచించారు. దర్శన్ కుమార్(కాన్వెంట్ స్కూల్), శ్రావణి(ఎంజేపీ ఈదులసవర్గాం, సాయి తేజస్విని(లిటిల్ ఫ్లవర్ స్కూల్)ల ప్రదర్శనలు రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కె. రఘు రమణ, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ ఆరె భాస్కర్, సెక్టరియల్ అధికారులు నారాయణ, ఉదయ శ్రీ, ప్రధానోపాధ్యాయలు మహాలక్ష్మి, ప్రత్యూష, పాఠశాల ప్రధాన ఆచార్యులు నర్సింగ్ రావు, వినోద్, న్యాయ నిర్ణేతలుగా రాఘవేందర్, పోచ్చురెడ్డి, సుమలత, వాసుఖి, శ్రీనివాస్, విఠల్, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

వారసంతలో కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని వారసంతలో కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ సతీమణి రావి సునీత ప్రచారం నిర్వహించారు. రావి శ్రీనివాస్‌కు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారంతో పాటు వారసంతలో ప్రచారం నిర్వహించారు. వారసంతలో కాంగ్రెస్ మెనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొయిరె బండు, నాయకులు బాపూజీ, భాస్కర్, వాగయ్య, చంద్రు పాల్గొన్నారు.

రూ.1.90 లక్షలు సీజ్

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ఇంటర్‌కెడ్ బాడర్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల వాహనాల తనిఖీలో భాగంగా రూ.1.90 లక్షల నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్సై సాగర్ తెలిపారు. ప్రభాకర్ అనే వ్యక్తి గడ్‌చాందూర్ నుండి బీహార్‌కు వెళ్తుండగా వాహనాన్ని తనిఖీ చేశారు. రూ.1.90 లక్షలు లభించినట్టు, ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో డబ్బులను సీజ్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

15న జిల్లా కేంద్రంలో చదరంగం పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో తెలంగాణ ఓపెన్ టు ఆల్ చదరంగం పోటీలను ఈ నెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్టు అర్జున చేవా అకాడమీ చైర్మన్ కోట సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ తాటియ గార్డెన్‌లో పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 14వ తేదీ సాయంత్రం 7:00 లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి రూ.25 వేల నగదు బహుమతితో పాటు, ఇతర బహుమతులు అందజేయడం జరుగుతుందని, ఎటువంటి ప్రవేశరుసుము తీసుకోవడం జరగదని ఇతర వివరాల కోసం 9030970916, 9490873271, 8978026306 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

జన్మదినం సందర్భంగా పుస్తకాలు, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని పెసరుగుంట గ్రామానికి చెందిన యువకుడు కామెర రాజ్‌కుమార్ తన పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఉన్న ఊరికి, చదువుకున్న పాఠశాలకు, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తులసీరాం, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, యువకులు సతీష్, రాజు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని చిచ్చుపెల్లి గ్రామంలో ఆశా వర్కర్లకు శుక్రవారం హెచ్‌ఈఓ రవిదాస్ అవగాహన సదస్సు నిర్వహించారు. పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. గ్రామంలో పరిశుభ్రంగా ఉంచే విధంగా ఎప్పటికప్పుడు ఆశావర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌సీ రజీయా, ఏఎన్ఎం గోదావరి ఉన్నారు.

గెలుపు కోసం మూడు పార్టీల ప్రచారం

నవతెలంగాణ - కౌటాల

30న జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. తమ గుర్తులను చూపిస్తూ తమకే ఓటు వేయాలని ప్రచారం చేశారు. మేనిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరిస్తూ కోనేరు కోనప్పను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నక్క శంకర్ ప్రచారం చేశారు.

మతిస్థిమితం కోల్పోయిన వృద్ధుడి మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మతిస్థిమితం కోల్పోయిన వృద్ధుడు మరణించిన ఘటన మండలంలోని తంతోలి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముధోల్‌కు చెందిన మార్కంటి నారాయణ(70) మతిస్థిమితం కోల్పోయి తంతోలి గ్రామంలో రోడ్డుపై తిరుగుతున్నారు. ఆకలితో అలమటించి అనారోగ్య కారణాలవల్ల మరణించాడు. గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ముజాహిద్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్డం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

గర్భిణీలు పౌష్టికాహారం తీసుకుంటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని పీహెచ్‌సీ వైద్యులు డా. విక్రమ్ కుమార్ తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీలో గర్భిణీలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 50 మంది గర్భిణీలకు పరీక్షలు చేశారు. అనంతరం తీసుకోవలసిన పౌష్టికాహారం, వ్యాయమం తదితర వాటి గురించి జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డా. రాంబాబు, సీహెచ్ఓ లక్ష్మి, హెచ్‌ఈఓ నాందేవ్, పీహెచ్ఎన్ఓ సుశీల, హెల్త్ సూపర్ వైజర్లు చౌహన్ చరణ్‌దాస్, సతవ్వ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1963 నుంచి 1971 వరకు పదేళ్లపాటు చదువుకున్న పూర్వ విద్యార్థుల మెగా సమ్మేళనం విజయవంతం చేయాలని నిర్వాహకులు సునీల్ మాసాడి, షిర్ప అశోక్, వల్లపు అశోక్, గుండా బాలేశ్వర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గుండి రోడ్‌లో గల వాసవి భవన్‌లో డిసెంబర్ 10వ తేదీన మెగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడానికి నిర్ణయించినట్లు తెలిపారు. తమ వద్ద ఉన్న వివరాలతో అందరినీ సంప్రదించే ప్రయత్నం చేస్తున్నామని పదేళ్ల వరకు అందులో చదువుకున్న ప్రతి ఒక్కరు పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బావురావు, శ్రీకాంత్, పుల్లూరు కిష్టయ్య, సుగుణాకర్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-కెరమెరి

అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మోసిన్ అలీ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు అనుమానస్పద గ్రామాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సోమలగూడ గ్రామ సమీపంలో సుమారు 1600 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించారు. గుర్తించిన బెల్లం పానకాన్ని నేలమట్టం చేశారు. సోమలగూడ గ్రామంలో ధరావత్ తిరుపతి వద్ద 20 లీటర్ల గుడుంబా మద్యం లభించగా స్వాధీనం చేసి కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించిన శాఖాపరమైన చర్యలు తీసుంటామని హెచ్చరించారు. గుడుంబా, అక్రమ మద్యం విక్రయించే వారి సమాచారం తెల్సిన, అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించిన తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ దాడుల్లో ఎస్సై విజయ లక్ష్మి, సిబ్బంది సురేష్, మహేష్, విజయలక్ష్మి, మమత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ఇందారం, రామారావు పేట్ గ్రామాలకు చెందిన చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. శుక్రవారం ఉదయం గడ్డం వివేక్ వెంకటస్వామి నివాసంలో స్థానిక సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి ఆధ్వర్యంలో రామారావుపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీ రమేష్, మేరుగు నారాయణ, మాజీ ఉప సర్పంచ్ గడ్డం శ్రీనివాస్, ఇందారం గ్రామానికి చెందిన తొగరి శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా రసూల్ పల్లి గ్రామానికి చెందిన మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూరు నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను గెలిపించడానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ఓడించండి

ఆర్టీసీ డ్రైవర్స్ [illegible] సెక్రటరీ

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్మికుల సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టని బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ఓడించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయు భవన్‌లో ఆర్టీసీ ప్రయివేట్ డ్రైవర్స్ యూనియన్ డిపో అధ్యక్షుడు మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్‌లు కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో వాటికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఆర్టీసీ ప్రయివేట్ బస్సు డ్రైవర్ల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు కనీస వేతనం రూ.32000 ఇవ్వడంతో పాటు, ఈఎస్ఐ, పీఎఫ్ కార్పొరేట్ వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయడంతో పాటు, ఉన్నతాధికారుల వేధింపులు ఆపివేయాలన్నారు. అద్దె బస్సు డ్రైవర్లను ఆర్టీసీ కార్మికులుగా గుర్తించాలన్నారు. ఇతర రంగాలలోని కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాన ఉన్న పార్టీకి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి దివాకర్, షఫిక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలేష్ కుమార్, కోశాధికారి సాయి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ పి.తేజ, సభ్యులు గణేష్, అంజి, బాలకృష్ణ, ఇమామ్, శేఖర్, శంకర్ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు ఉపయోగించుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వాలు ప్రజల కోసం అమలుచేసే సంక్షేమ పథకాల్లో నగదు రూపంలో ఇచ్చే వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజగోపాల్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని జడ్పీపీఎస్ఎస్ పాఠశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రుద్రారం శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కళాజాత వారిచే బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. నగదు రహిత లావాదేవీలపై, సైబర్ మోసాలపై జాగ్రత్తలు వహించాలని, పాటల రూపంలో కళా బృందం వారు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలించాలని ప్రభుత్వాలు పథకాలు అమలువుతున్నాయని, వీటిని అమలుచేసుకొనే హక్కు మీపై ఉందన్నారు. అలాగే పై చదువుల కోసం రుణాలు కావాల్సిన వారు తమ తల్లిదండ్రులతో చెప్పి బ్యాంకు సిబ్బందిని సంప్రదించాలని, కేవలం వ్యవసాయం, పరిశ్రమలకు, ఇండ్ల నిర్మాణానికి కాకుండా విద్య రుణం కూడా ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఇండిపెండెంట్ అభ్యర్థి సిడాం అన్నిగను గెలిపించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న సిడాం అన్నిగ అభ్యర్థిత్వాన్ని తాము బలపరుస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ కోరారు. స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తర్వాత బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో పాలకులు బీసీలని పట్టించుకోలేదని, బీసీలకి కనీసం స్టడీ సర్కిల్ గాని, బీసీ భవనం గాని ఏర్పాటు చేయకుండ బీసీలని అవమానించారన్నారు. ఆదివాసీలలో కొలం తెగ వారు చాలా వెనుకబడి ఉన్నారని ఆ తెగ నుండి నిజాయితీ పరుడైన అన్నిగ నామినేషన్ వేశడని ఆయనను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయిస్తున్నట్లు తెలిపారు. బీసీ సంఘం తరపున నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రచారం చేసి ఆయనను గెలిపించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొలం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీంరావు, బీసీ



యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగ్డే మారుతీ పటేల్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేష్, యువజన సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు బొట్టుపల్లి ప్రశాంత్, మండల అధ్యక్షుడు సిరికొండ సాయికృష్ణ, కొలం సంఘం జిల్లా నాయకులు ఆత్రం భీంరావు, ఆత్రం జలపతి రావు, ఆత్రం తిరుపతి, మాడావి నాగోరావ్, ఆత్రం తుకారాం, కోవా భీంరావు, ఆత్రం సోనేరావ్, టెకం రమేష్, మడావి ముకుంద్‌రావు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్ : జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో పనిచేస్తూ ఎలక్షన్ డ్యూటీ కేటాయించబడ్డ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం ఫామ్-12 తో సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్లకు ఈ నెల 12 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫామ్-12 తో పాటు ఓటర్ ఐడీ జిరాక్స్ కాపీతో పాటు, డ్యూటీ కేటాయించబడ్డ ఆర్డర్ జిరాక్స్ కాపీని జతపరిచి, విధులు నిర్వహించే నియోజకవర్గంలోని రిటర్నింగ్ అధికారికి కళాశాలలో ప్రిన్సిపాల్స్‌కు సమర్పించాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

● ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ



నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేయడమే తమ లక్ష్యమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయు భవన్‌లో నిర్వహించిన జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికకు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు చేసి ఉపాధ్యాయుల హక్కులు సాధించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికైన కమిటీని అభినందించారు. సమస్యలపై పోరాడుతూనే ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండాలన్నారు. ఎస్టీయు జిల్లా నూతన అధ్యక్షుడిగా చునార్కార్ తుకారం ఎన్నిక కాగా, అసోసియేట్ అధ్యక్షులుగా బడిరాం కాళిదాసు మండల్ ఉపాధ్యక్షులుగా జె.సంతోష్, శారద, నగేష్, ఎస్.సంతోష్, ప్రధాన కార్యదర్శిగా మనీష్, అదనపు ప్రధాన కార్యదర్శిగా దురిశెట్టి రాజశేఖర్, సెక్రటరీలుగా భాగ్యశ్రీ, అన్నపూర్ణ, అరుణ్, ఆర్థిక సెక్రెటరీగా ఎస్కే సులేమాన్, ఆర్థిక కమిటీ మెంబర్లుగా లక్ష్మణ్, జగన్‌లు ఎంపికయ్యారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విశ్రాంత ఉద్యోగులకు బ్యాంకు అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంతి ఉద్యోగ సంఘ భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణగౌడ్ అధ్యక్షతన ఉద్యోగులకు బ్యాంకు సేవలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు 73 సంవత్సరాల వయసు వారికి రుణం అందజేయడం జరుగుతుందని అవసరం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విశ్రాంత ఉద్యోగులు ప్రమాదంలో మరణించినట్లయితే ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ పాలసీ నుంచి ఆ మొత్తాన్ని పొందవచ్చన్నారు. వివిధ పనుల నిమిత్తం బ్యాంకులకు వచ్చే పెన్షన్ దారులకు నాణ్యమైన సేవలు అందించడానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ యూనిట్ అధ్యక్షుడు రమేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు శంకర్, యూనిట్ కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి కిష్టయ్య, నాయకులు వెంకన్న, వెంకటేశ్వర్లు, కనకమ్మ, అమల, పద్మ, సత్యమ్మ, సుభాష్ సింగ్, నాగయ్య పాల్గొన్నారు.

c
m
y
k

గడపగడపకు బీఆర్ఎస్ ప్రచారం

కోటపల్లి : మండలంలోని ఆలుగామ గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ ఎంపీటీసీ గోమస రజిత ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ గెలిపించాలని మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ తెలంగాణ రాష్ట్ర సాధించుకున్న తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత రైతులు సుఖశాంతులతో ఉన్నారని అన్నారు. గడిచిన 60 సంవత్సరాలలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రజానీకానికి చేసిందేమీ లేదని అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాల్క సుమ గెలుపొందటానికి ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కొండగుర్ల రామయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తేనే సంక్షేమ పథకాలు



నవతెలంగాణ-జన్నారం

మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ యధావిధిగా కొనసాగుతాయని ఆ పార్టీ మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి సిటిమల్ల భరత్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోన్కల్ జన్నారం, గ్రామాల్లో గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రభుత్వం ఏర్పడితే 400కే సిలిండర్ అందిస్తామన్నారు, మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, నాయకులు మాదాడి రవీందర్‌రావు, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, రాజు నాయక్, రవి ముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధే బీఆర్ఎస్ నినాదం

అభివృద్ధి బీఆర్ఎస్ నినాదమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. మండలంలోని హస్టల్ తండా గ్రామానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించే విధంగా అందరూ కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలి

● రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



కరపత్రాలు విడుదల చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ తదితరులు

నవతెలంగాణ-హాజీపూర్

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలను ఓ డించాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, పద్మజలు అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ), ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రూపొందించిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల స్టూడెంట్స్ యూత్ మేనిఫెస్టో మంచిర్యాల జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధాగం శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య వక్తలుగా పాల్గొన్న ఆకునూరు మురళి, లక్ష్మీనారాయణ, పద్మజలు మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు పీడీఎస్‌యూ, పీవైఎల్‌లు విద్యార్థులకు, యువతకు ప్రత్యేకంగా మేనిఫెస్టో రూపొందించడం అభినందనీయం అన్నారు. పదేండ్ల కాలంగా కేంద్రంలో, రాష్ట్రంలో పాలిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలో విద్యార్థి నిరుద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబించాయన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి నిరుద్యోగులను మోసం చేశాయన్నారు. మోడీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, కేసీఆర్ లక్ష ఉద్యోగాలు కల్పిస్తానని ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం మొత్తం నాశనమైపోయిందని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ముఖ్య మంత్రి కేసీఆర్ కొమ్ముకాశారన్నారు. 6వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని, జూనియర్, డిగ్రీ కాలేజీలు సమస్యలతో సతమతం అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసి ప్రయివేటు యూనివర్సిటీలను తీసుకురావడం ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్య చదువుకునే అవకాశం లేదని వాపోయారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా 30 లక్షల మంది నిరుద్యోగులు నష్టపోతే కనీసం మాట్లాడలేదని అన్నారు. మళ్లీ నేడు వారి ఓట్ల కోసం అధికారంలోకి వస్తే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామని ఉద్యోగాలు కల్పిస్తామని మాయ మాటలు చెబుతున్నారన్నారు. పేపర్ లీకేజీ జరిగినప్పుడే స్పందిస్తే ప్రవళిక లాంటి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఉండేవారన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన పూర్తిగా అవినీతిమయమైందని రూ.వేలాది కోట్లతో కట్టిన కాళేశ్వరం కుంగిపోవడం దీనికి నిదర్శనం అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020 విద్యను పూర్తిగా కార్పోరేటీకరణ, ప్రయివేటీకరణ చేస్తుందని మండిపడ్డారు. ఈ విధానంతో కుల, మత అసమానతలు పెరిగిపోతాయని అన్నారు. సెలబస్‌లో అశాస్త్రీయమైన భావజాలాన్ని నింపి విద్యార్థుల మెదళ్లను కలుషితం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్ధన్, పీఓ డబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగా, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లాల్ కుమార్, కార్యదర్శి శంకర్. జిల్లా నాయకులు సిద్ధార్థ, రాహుల్, మనోహర్, తిరుపతి పాల్గొన్నారు.

దేవాపూర్‌లో ఆటో డ్రైవర్లకు స్టిక్కర్ల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ గ్రామంలో శుక్రవారం మండమర్రి సీఐ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అభయ యాప్ స్టిక్కర్లను పంపిణీ చేశారు. ముందు సీఐ మహేందర్ రెడ్డి చేతుల మీదుగా అభయ యాప్ స్టిక్కర్లను విడుదల చేసి దేవాపూర్ ఆటోల వెనుక, ముందు వైపు అభయ యాప్ స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-హాజీపూర్

వేంపల్లి, ముల్కల్ల గ్రామాల్లో శనివారంవిద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని మంచిర్యాల రూరల్ ఏఈ సంధ్యా రాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫర్ ల మరమ్మతు, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, పంప్ హౌజ్ ఫీడర్ల మెంటనెన్స్ వుంటుందని దీని కారణంగా ఉదయ్ 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

గర్భిణులు అదనపు ఆహారం తీసుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

గర్భిణులుల సమయానికి పోషక విలువలు ఉన్న అదనపు ఆహారాన్ని తీసుకుని పండంటి బిడ్డకు జన్మనివ్వాలని సీటీపీఓ ఉమాదేవి అన్నారు. శుక్రవారం తాండూర్ గ్రామపంచాయతీలోని గిరిజన గ్రామం కర్ణంగట్టం మినీ అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణీలకు సామూహిక సీమంతాలు చేశారు. పుట్టబోయే బిడ్డ ఎదుగుదలకు చనుపాల వృద్ధికి బాలింతలు అదనపు ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. బాలింతలు ఆహారంలో సులువుగా జీర్ణమయ్యే పప్పులు, ఆకుకూరలు, పాలు, పండ్లు, చేపలు రోజువారి ఆహారంలో తీసుకోవాలని సూచించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా గర్భిణీలకు పాలు గుడ్లతో పాటు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రసవ సమయానికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలన్నారు. తల్లి బిడ్డలు క్షేమంగా ఉండాలంటే ఆస్పత్రిలో సహజమైన సుఖ ప్రసవం జరిగే విధంగా చూసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించడం ద్వారా బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ మమత, ప్రాథమిక పాఠశాల టీచర్ మల్లేష్, అంగన్‌వాడీ టీచర్లు విజయ, పూలవతి, భాగ్య పాల్గొన్నారు.

మా ఆయనకు ఓటేసి గెలిపించండి

● కిష్టాపూర్‌లో వివేక్ సతీమణి ప్రచారం



నవతెలంగాణ-జైపూర్

తొలి దశలో మామ వెంకటస్వామి, మలిదశలో మా ఆయన వివేక్ వెంకటస్వామి ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఉద్యమించారు. ఉద్యమ చరిత్ర కలిగిన మచ్చలేని మా కుటుంబాన్ని ఆదరించాలని, చెన్నూర్ ఎమ్మెల్యేగా వివేక్ వెంకటస్వామి గెలిపించాలని వివేక్ సతీమణి గడ్డం సరోజ కోరారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి కిష్టాపూర్ గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరుగా గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకే వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారని తెలిపారు. ప్రజాసేవయే పరమావధిగా భావించే వివేక్ వెంకటస్వామిని ఆదరించాలని అత్యధిక మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పథకాల ప్రయోజనాలు వివరిస్తూ ప్రచారం చేపట్టిన ఆమెకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కిష్టాపూర్‌కి చేరుకున్న గడ్డం సరోజ వివేక్ వెంకట స్వామికి డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమ్మద్ ఫయాజుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పద్మజా పాపిరెడ్డి, లింగారెడ్డి, గోనె నరసయ్య, నామల తిరుపతి, వెంకటి, లక్ష్మణ్, బేతు తిరుపతిరెడ్డి, గూడెల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలని ఎన్ఎస్‌యూఐ ప్రచారం

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జుకు మద్దతుగా మండలంలోని లింగయ్య పల్లె, సూరారం గూడెం, పోనకల్ గొల్లగూడెం గ్రామాలలోశుక్రవారం ఎన్ఎస్‌యూఐ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహేల్ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ స్కీములపై ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ గెలిస్తే రూ.500కే సిలిండర్ అందిస్తామన్నారు. చేతిగుర్తుకు ఓటు వేయాలన్నారు.

కవ్వాల్‌లో కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీ స్కీములను తప్పకుండా అమలు చేస్తామని ఆ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం



మండలంలోని కవ్వాల్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ 6 గ్యారంటీ స్కీములపై ప్రజలకు వివరించారు. కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు పేదలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ నాయకులు ముజ్జు, రాకేష్ రామన్న అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలన్నారు.

c m y k

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం

- ప్రజలను పాలకులు చేయడమే లక్ష్యం
- బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

బీఎస్పీ అధికారంలోకి వస్తే పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, పార్టీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిర్పూర్ నియోగజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం కాగజ్‌నగర్ పట్టణంలోని తమ బీఎస్పీ కార్యాలయం నుండి సిర్పూర్ వరకు వాహనాలు, బైక్ ర్యాలీ నిర్వహించి బస్టాండులోని ప్రధాన కూడలి వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్ గడ్డపై ఆంధ్ర వలస దోపిడి పాలన పోవాలంటే భారీ మెజార్టీతో తనను గెలిపించాలని, తన జీవితంలో తొలి నామినేషన్ రాష్ట్రంలోని తొలి నియోజకవర్గమైన సిర్పూర్‌లో మీ అభిమానం మేరకు నామినేషన్ దాఖలు చేశానని, ప్రతి ఒక్కరు నన్ను సిర్పూర్ నుంచి బీఎస్పీని మొదటిస్థానంలో నిలిపి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటానని, సిర్పూర్ గడ్డ నుంచి పోటీ చేస్తుంది తన కోసం కాదని మీ కోసమేనన్నారు. యువతకు ఉద్యోగాలు అందించేందుకు జరుగుతున్న యుద్ధమే ఈ ఎన్నికలని, రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఎవరికి ఓటు వేసిన బీఆర్ఎస్‌కే వెళ్తుందని, వీరి ముగ్గురికి చీకటి ఒప్పందం ఉన్నందునే ఇప్పటివరకు కవితను జైల్లో వేయలేదని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు బీఎస్పీకి అధికారం ఇవ్వాలన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం ఏ రంగంలో కూడా అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ఆయన వెంట బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి, అర్షద్ హుస్సేన్, లెండుగురె శ్యాంరావు, దుర్గం మారుతి, దుర్గం ప్రవీన్, షేక్ చాంద్ ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం

- నియోజకవర్గ అభ్యర్థి కోవ లక్ష్మి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి కోవ లక్ష్మి పునరుద్ఘాటించారు. రెబ్బెన మండలం ఎడవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం తమ పార్టీ కృషి చేస్తోందన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమం కోసం మేనిఫెస్టో రూపొందించినట్లు తెలిపారు. ప్రజలు మరోసారి అధికారం ఇవ్వాలని కోరారు.

జడ్పీటీసీ ఆధ్వర్యంలో చేరికలు

మండలంలోని చోర్పల్లి గ్రామా సర్పంచ్ కమ్మరి రోజశేఖర్ కాంగ్రెస్‌ని వీడి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరితో పాటు రిటైడ్ అటవీ అధికారి రాజేశ్వర్, మరికొంత మంది వివిధ పార్టీల కార్యకర్తలు, యువలకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు సుంకరి పెంటయ్య, బూసి భీమేష్, పెద్దపల్లి శంకర్, మిట్ట తిరుపతి, మిట్ట పోషన్, నారా ఆశన్న, సైదం మధుకర్, గౌత్రే చిన్నయ్య, కమ్మరి క్రిష్ణ, మారుతి, ప్రేమ్‌రాజ్, సైదం సురేష్, పోశెట్టి, వెంకన్న, సుగునాకర్, సైదం తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ ఎన్నికలే



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

- సీఎం కుర్చీ కోసం కాంగ్రెసోళ్లు కొట్లాడుకుంటారు
- ఉద్యోగులు, నిరుద్యోగులను మోసం చేసిన సీఎం కేసీఆర్
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు వస్తాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం సిర్పూరు (టి) మండలకేంద్రంలో నిర్వహించిన పార్టీ విజయసంకల్ప సభకు ఆయన హాజరయ్యారు. సిర్పూరు (టి) నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు నామినేషన్ కార్యక్రమం కోసం వచ్చిన ఆయన మండల కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో మాట్లాడారు. కాంగ్రెస్‌లో సీఎం కుర్చి కోసం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు సిద్దంగా ఉన్నారని, వీరి మధ్య సయోధ్య లేక రాష్ట్రంలో ప్రభుత్వం పడిపోయి మళ్లీ ఎన్నికలు వస్తాయని అన్నారు. బీఆర్ఎస్ గెలిచినా అదే పరిస్థితి ఉంటుందని అన్నారు. మళ్లీ బీఆర్ఎస్‌కు పట్టం కడితే కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్‌ను సీఎం చేసేందుకు ప్రయత్నిస్తారని, దీంతో ఆ పార్టీలో ముసలం పుట్టి ప్రభుత్వం పడి పోవడం ఖాయమని అన్నారు. బీజేపీకి అధికారం ఇస్తే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతాడని, బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇవ్వకుండా, ఇచ్చినా కోర్టులో కేసులు వేయించి నోటిఫికేషన్‌లు రద్దు చేయిస్తూ 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోందని అన్నారు. ఉద్యోగ, నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్‌కు రాబోయే ఎన్నికలలో బుద్ది చెప్పాలని కోరారు. ఇక్కడి నుండి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తరలించినా, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వకపోయినా కేసీఆర్‌ను అడిగే దమ్ము స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు లేదని విమర్శించారు. ఆరె కులస్థులకు ఓబీసీ జాబితాలో చోటు, మాలి కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని అన్నారు. దీనికి ముందు బీజేపీ అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గానికి చుట్టూ జీవనదులు ఉన్నా ఆ నీటిని పంట పోలాలకు తరలించడంలో ఎమ్మెల్యే కోనప్ప విఫలమయ్యాడని అన్నారు. సిర్పూరు పేపర్ మిల్లును తెరిపించినా, అది జెకే యాజమాన్యానికి, కోనేరు కోనప్పకే లాభం జరిగిందే తప్ప కార్మికులకు ఒరిగిందేమీ లేదని అన్నారు. బీజేపీ దళితులకు వ్యతిరేకం కాదని, దళిత మహిళను రాష్ట్రపతి చేసింది బీజేపీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. తనకు ఒక్క అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ది చేసి చూపిస్తానని అన్నారు. అనంతరం పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ అశోక్‌లోయ, సిర్పూరు మాజీ ఎంపీపీ జి మాలతి, ఆర్ఎంపి గజ్జల లక్ష్మణ్ తదితరులు పార్టీలో చేరగా, వారికి బండి సంజయ్ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్రలోని వర్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సిర్పూరు మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రౌడీషీటర్ సంతోష్‌రెడ్డి దారుణ హత్య

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన రౌడీషీటర్ సంతోష్‌రెడ్డి(36) శుక్రవారం సాయంత్రం దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి, గొంతు కోసి హత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ ఏరియాలోని తైబానగర్ గల్లీలోగల భారత్ హోటల్‌లో జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..స్థానిక హోటల్ యజమానితోపాటు పలువురిని సంతోష్‌రెడ్డి డబ్బుల కోసం రెండ్రోజులుగా వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. సాయంత్రం హోటల్‌కు రాగా, అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తులు పథకం ప్రకారం ముందుగా కత్తితో దాడి చేసి, ఆ పై గొంతు భాగంలో కత్తితో తీవ్రంగా పొడిచారు. తీవ్ర గాయాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.



సంతోష్‌రెడ్డి మూడు హత్య కేసులు, మరో 13 బెదిరింపులు, దొంగతనాలకు సంబంధించిన కేసులలో నిందితుడు. ఓ కేసులో ఇటీవలే బెయిల్ పై వచ్చిన ఆయనను కాగజ్‌నగర్‌లో ఉండరాదంటూ శుక్రవారం ఉదయమే ప్యాసింజర్ రైలు ఎక్కించారు. ఆయన ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్‌లో దిగి మళ్లీ కాగజ్‌నగర్ వచ్చినట్లు సమాచారం. మృతుడికి భార్య ఉండగా, ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌హెచ్‌ఓ బుద్దె స్వామి తెలిపారు. ఘటన స్థలాన్ని ఎస్పీ సురేష్ కుమార్ సందర్శించారు.

ఆపద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు ఆపద సమయంలో ధైర్యంగా ఉండి సమయస్ఫూర్తితో వ్యవహరించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త బి.శారద అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పని ప్రదేశాలలో మహిళలపై జరుగుతున్న హింస చట్టం 2013పై ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశాలలో హింసకు గురవుతున్న మహిళలు ఇంటర్నల్ కంప్లైన్ కమిటీ, లోకల్ కంప్లైన్ కమిటీ ఫిర్యాదు చేయవచ్చుని, సమగ్ర విచారణ జరిపి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రమాదకరమైన, అవసరమైన సందర్భాలలో తెలివితో, కొత్త ఆలోచనతో, సమయస్ఫూర్తితో సమస్యలను ఎలా ఎదుర్కోవాలో, అలాగే ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహాయం ఎలా అందించాలో బై స్టాండర్డ్ ఇంటర్ వెన్షన్ ద్వారా వివరించారు. ఈ



కార్యక్రమంలో జిల్లా మహిళ సాధికారత కేంద్రం సిబ్బంది రవి, సాగర్, డీపీఎంలు యాదగిరి, అన్నాజీ, మిత్తు, భూమక్క, ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన మండలాల ఏపీఎంలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు



నవతెలంగాణ-హాజీపూర్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గుడిపేటలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు రసవత్తరంగా సాగాయి. అండర్-14 బాలుర, అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో ఈ బాక్సింగ్ పోటీలు నిర్వహించగా మంచిర్యాల జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బాక్సింగ్ పోటీలు హోరాహోరీగా సాగాయి. క్రీడాకారులకు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి శేఖర్, గుడిపేట ఎంజేపీ గురుకుల పాఠశాల ఇంచార్జీ ప్రిన్సిపల్ రొనాల్డ్ కిరణ్, డిప్యూటీ వార్డెన్ సందీప్‌కుమార్, పీడీ రాజేశ్, పీఈటీలు దేవేందర్, సీనియర్ బాక్సర్లు సాయి, శివ, సాయికుమార్, కోచ్ రాజేశ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పరిమళ పాల్గొన్నారు. జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు త్వరలో నిర్వహించనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారని అసోసియేషన్ తెలియజేసింది.

రూ.4లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్

నస్పూర్ ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. నస్పూర్ గేట్ సమీపంలో నస్పూర్‌కు చెందిన గోవిందుల మల్లేష్ వద్ద రూ.4లక్షలు నగదు స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అందజేసినట్లు పేర్కొన్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎన్నికల పరిశీలకుడి తనిఖీ

నవతెలంగాణ - కాసిపేట

బెల్లంపల్లి ఎన్నికల అధికారి కార్యాలయాన్ని శుక్రవారం కేంద్ర ఎన్నికల పరిశీలకులు బిశ్వజిత్ దుత్త పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల కార్యాలయాన్ని సందర్శించి ఎన్నికల నిర్వహణ పనులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి రాహుల్, ఏసీపీ సదయ్య పాల్గొన్నారు.